నాణ్యతకు తిలోదకాలు

- రోడ్డు విస్తరణ పనుల్లో నిబంధనలకు పాతర
- ఆగమేఘాల మీద యంత్రాలతో తారురోడ్డు నిర్మాణం
- విద్యుత్ స్తంభాలు తొలగించకుండా పనులు
- కల్వర్టులు వెడల్పు చేయని వైనం



మధ్యలో పాత రోడ్డు ఇరువైపుల కొత్త తారురోడ్డు



విద్యుత్ స్తంభం మార్చకుండా వేసిన తారురోడ్డు



వర్షంలో తారురోడ్డు పనులు చేస్తున్న యంత్రం



పాత కల్వర్టు విస్తరించకుండా వేసిన కొత్తగా రోడ్డు

నాతవరం: ఇటీవల అసెంబ్లీ స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు సుందరకోట పర్యటన నేపథ్యంలో ఆర్అండ్‌బీ శాఖ అధికారులు ఆగమేఘాల మీద తారు రోడ్డు నిర్మించారు. ఈ పనుల్లో కనీసం నిబంధనలు పాటించలేదు. నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు ఇచ్చారు. మండలంలో చమ్మచింత నుంచి సరుగుడు గ్రామం వరకు ఆర్అండ్‌బీ రోడ్డు విస్తరణ కోసం 2018లో అప్పటిప్రభుత్వం రూ.14 కోట్లు మంజూరు చేసింది. ఈ రోడ్డుకు సంబంధించి టెండర్ల ప్రక్రియ తర్వాత కాంట్రాక్టరు పనులు ప్రారంభించాడు. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండంతో కొంత మేర పనులు చేసి అసంపూర్తిగా వదిలేశాడు. అప్పట్లో చేసిన పనులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లింపులు చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్డు విస్తరణ పనులు మరలా మొదలెట్టారు. గత నెల 24న స్పీకరు అయ్యన్నపాత్రుడు సుందరకోట, అసనగిరి మధ్య రోడ్డు శంకుస్థాపనకు వచ్చారు. ఆయన వస్తుండటంతో చమ్మచింత నుంచి వేయాల్సిన తారు రోడ్డు మధ్యలోంచి గుమ్మడిగొండ జంక్షన్ నుంచి సరుగుడు వరకు యుద్ధప్రాతిపదికన వేశారు.

వర్షంలోనే తారు రోడ్డు నిర్మాణం...

నాణ్యతా ప్రమాణాలు మరిచి రోడ్డు వేయడంతో వెంటనే పాడైందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎండలు కాసేటప్పుడే వేయాల్సి ఉండగా, ఒక పక్క కురుస్తున్న వర్షంలోనే తడుచుకుంటూ తారురోడ్డును యంత్రాలతో వేశారు. పాతరోడ్డు వదిలేసి ఇరువైపులా మార్జిన్లు విస్తరణ చేసి తారు రోడ్డు వేశారు. రోడ్డు విస్తరణ చేసేటప్పుడు ఇరువైపులా విద్యుత్ స్తంభాలు మార్చకుండా అలానే వదిలేశారు. ఇరుకు రోడ్డులో వెడల్పుగా కల్వర్టులు నిర్మించకుండా పాతవి వదిలేశారు. ఈ విధంగా నిబంధనలు పాటించకుండా రోడ్డు వేయడం వల్ల ప్రమాదాలు సంభవిస్తాయని వాహన చోదకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. స్పీకరు మెప్పు కోసమే ఆగమేఘాల మీద రోడ్డు వేశారని, కనీసం నాణ్యత పాటించలేదని స్థానికులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. అయితే గిరిజన ప్రాంతాల్లో రోడ్లు నిబంధనల ప్రకారం నాణ్యతగా వేయాలని సుందరకోట సభలో స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు ఇంజనీరింగ్ అధికారులను హెచ్చరించడం గమనార్హం.

క్లుప్తంగా

వెండి ఆభరణాల బహూకరణ



శివలింగానికి దాత తాతబాబు అలంకరించిన వెండి ఆభరణాలు

రోలుగుంట: స్థానిక కొండ శిఖరాన జగ్గారాయడు గుడిలో శివలింగానికి నేత్రాలు, నామాలకు గాను పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మడ్డు తాతబాబు ఆరు తులాల వెండి ఆభరణాలు బహూకరించారు. ఇతను శివ భక్తుడు కావడంతో వీటిని సమర్పించినట్లు తెలిపాడు. నిర్వాహకులు దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ సమస్య లేకుండా చర్యలు

గొలుగొండ: మండలంలో గొలుగొండ, కృష్ణదేవిపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా అధికారులు శుక్రవారం చర్యలు చేపట్టారు. రెండు సబ్ స్టేషన్ల పరిధి 33 కేవీ లైన్ల వద్ద తుప్పల తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. సుమారుగా 30 ప్రధాన గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు



నిందితులతో రూరల్ పోలీసులు

నర్సీపట్నం: మండలంలో చెట్టుపల్లి గ్రామ శివారులో పేకాట శిబిరంపై రూరల్ ఎస్సై రాజారావు, సిబ్బందితో కలిసి శుక్రవారం దాడులు నిర్వహించారు. నిందితులు కిలపర్తి శ్రీను(పెదబొడ్డేపల్లి), తంగెళ్ల కన్నారావు(కుసర్లపూడి), సబ్బవరపు సత్యనారాయణ(కుసర్లపూడి), చిన్ని అప్పారావు(జేపీ అగ్రహారం), చిటికెల వెంకటకుమార్(పెదబొడ్డేపల్లి)లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.5,040 స్వాధీనం చేసుకున్నారు.

ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తాం



మాట్లాడుతున్న సంస్థ చైర్మన్ పిల్లా అప్పలనాయుడు

మాడుగుల రూరల్: రైతు పండించిన పంట వారే స్వయంగా విక్రయించుకోవాలనే ఉద్దేశంతో దేశ వ్యాప్తంగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేశారని మాడుగుల తెన్నేటి రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ పిల్లా అప్పలనాయుడు తెలిపారు. శుక్రవారం సాయంత్రం మాడుగులలో సంఘం సమావేశం నిర్వహించారు. గతేడాది సంస్థ నిర్వహించిన వ్యాపార, అభివృద్ధి, త్వరలో నిర్వహించే కార్యక్రమాలు చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థ అనుగుణంగా విశాఖపట్నం భారతీయ విద్యా కేంద్రం ఆధ్వర్యంలో మాడుగులలో రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేశామన్నారు. 390 మంది సభ్యులతో కూడిన సంస్థ అభివృద్ధి బాటలో నడుస్తుందన్నారు. ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. సంస్థ డైరెక్టర్లు కోట్ని సన్యాసినాయుడు, ఎ. కొండలరావు, టి. గణేశ్, కె. వెంకటరాజు, కె. శ్రీను, ఎల్. పోతురాజు, సీఈవో సౌమ్య, రైతులు పాల్గొన్నారు.

గోదాదేవికి కుంకుమ పూజలు



పూజల్లో పాల్గొన్న మహిళలు

మాకవరపాలెం: గోదాదేవికి ఘనంగా కుంకుమ పూజలు నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా శుక్రవారం స్థానిక రామాలయంలో గోదాదేవికి కుంకుమ పూజలు చేశారు. ఈ పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకురాలు రత్నమాల, సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రానివ్వద్దు

స్పీకర్ అయ్యన్నపాత్రుడు



ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశమైన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: వచ్చే వేసవిలో తాగునీటి ఎద్దడి రానివ్వకుండా ముందు చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గ్రామీణ నీటి పారుదలశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తన నివాసంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పైపులైన్లు, బోరు మోటార్లు సక్రమంగా పని చేయాలన్నారు. ఎక్కడైనా మరమ్మతులు అవసరం అనుకుంటే వాటిని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. నీటి ఎద్దడి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి తగిన ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. వచ్చే వేసవిలో ప్రతి గ్రామానికి తాగునీరు సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీఈ శ్రీరామ్, మండల ఏఈలు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం సభకు తరలిరండి

మాడుగుల రూరల్: హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి, రక్షణ, సమాజ సంరక్షణ కోసం తలపెట్టిన హైందవ శంఖారావం సభకు తరలిరావాలని చీడికాడ, మాడుగుల మండలాల శంఖారావం ప్రఖండ్ రాపేట రామకొండలరావు కోరారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు గన్నవరం విమానాశ్రయం సమీపంలో ఐదు లక్షల హిందూ బంధువులతో బహిరంగ సభ నిర్వహిస్తారన్నారు. హిందూ బంధువులు స్వచ్ఛందంగా తరలి రావాలని కోరారు. రెండు మండలాల నుంచి 25 బస్సుల్లో తరలి వెళ్లనున్నారని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నుంచి మాజీ చైర్‌పర్సన్ సస్పెన్షన్



మాట్లాడుతున్న టౌన్ పార్టీ అధ్యక్షుడు ఏకా శివ, పార్టీ నాయకులు

నర్సీపట్నం: మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ 17వ వార్డు కౌన్సిలర్ గుడబండి ఆదిలక్ష్మిని వైఎస్సార్‌సీపీ నుంచి సస్పెండ్ చేశామని ఆ పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ తెలిపారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మున్సిపల్ ముఖ్య నాయకులతో ఆయన మాట్లాడారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎన్నో పదవులు అనుభవించిన ఆదిలక్ష్మి, అధికారం కోల్పోయిన వెంటనే తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం సిగ్గు చేటన్నారు. పార్టీ క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నామన్నారు. పార్టీ ఆదేశాలను ధిక్కరించి టీడీపీకి అనుకూలంగా పని చేయటం సమంజసం కాదన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, పార్టీ లీగల్ సెల్ విభాగం ప్రతినిధి, కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర, నియోజవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు బయపురెడ్డి గణమ్మ, టౌన్ మహిళా విభాగం నాయకురాలు కణితి అన్నపూర్ణ, కోఆప్షన్ సభ్యురాలు షేక్ రోజా, కర్రి శ్రీనువాసరావు, తమరాన శ్రీనువాసరావు, యాదగిరి శేషు, బేతిరెడ్డి విజయ్, గంటా లలిత తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పశువైద్య సేవలు

- పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టరు చంద్రశేఖర్



పాడి రైతులకు సూచనలు చేస్తున్న డిప్యూటీ డైరెక్టరు చంద్రశేఖర్

కె.కోటపాడు: పశువైద్య కేంద్రాలతోపాటు రైతు సేవా కేంద్రాల ద్వారా పాడి పశువులకు సకాలంలో పశువైద్యం అందాలని ఉమ్మడి జిల్లా పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టరు చంద్రశేఖర్ తెలిపారు. కె.సంతపాలెం రైతు సేవా కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ నిర్వహించారు. ఇక్కడ పాడి రైతులకు అందించిన పశువైద్య సేవలతోపాటు పశుగణన రికార్డులను తనిఖీ చేసారు. పశువైద్య సహాయకులు నిర్ణీత సమయానికి కేంద్రాల్లో అందుబాటులో ఉండాలన్నారు. వీటితోపాటు ఉపాధి నిధులతో గోకులం షెడ్లను లబ్ధిదారులైన రైతులు త్వరితగతిన నిర్మాణం చేపట్టాలని సూచించారు. పశుసంవర్ధక శాఖ అధికారులు ఇచ్చే సూచనలను పాటించాలని తెలిపారు. చౌడువాడ పశువైద్యాధికారి సింహాచలంనాయుడు, కె.సంతపాలెం పశువైద్య సహాయకుడు త్రినాథ్ పాల్గొన్నారు.

ఆలయ భూముల విక్రయిస్తున్న వారిపై ఫిర్యాదు



వి.వి.అగ్రహారం సదస్సులో ఫిర్యాదు చేస్తున్న రైతులు

మాడుగుల రూరల్: ఆలయ భూములను జిరాయితీగా మార్చుకుని విక్రయిస్తున్న రైతులపై ఆలయ ధర్మకర్త రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేశారు. శుక్రవారం వి.వి.అగ్రహారం సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వి.వి.అగ్రహారం లక్ష్మీనారాయణ ఆలయానికి చెందిన ఎరుకువాడ రెవెన్యూ పరిధిలో 3 ఎకరాల భూమిని కొంతమంది రైతులు విక్రయించారని, ఆలయ వంశపారపర్య ధర్మకర్త దొండా కుమార్ ఫిర్యాదు చేశారు. తమ కుటుంబీకులు గతంలో ఆలయానికి భూములు ఇచ్చారన్నారు. దీనిపై స్పందించకపోతే కలెక్టర్‌తోపాటు, అమరావతిలో గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు. సయ్యపురెడ్డి కుటుంబీకులైన 40 మందికి చెందిన 40 ఎకరాలు దేవదాయ భూమిగా నమోదైందని బాధిత రైతులు ఫిర్యాదు చేశారు. తమ తాత, తండ్రుల నుంచి ఈ భూములు సాగు చేస్తున్నామన్నారు. రీసర్వే డీటీ గణపతిరావు, మండల సర్వేయరు జగదీశ్, వీఆర్వోలు, సర్పంచ్ వెలగాడ కామలక్ష్మి, ఈశ్వరరావు, మాజీ సర్పంచ్ సయ్యపురెడ్డి నారాయణరావు, నాయకుడు పాచిల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కొండయ్యపాలెంలో ధనుర్మాస పూజలు

మాడుగుల రూరల్: పోతనపూడి పంచాయతీ శివారు కొండయ్యపాలెంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. రోజూ ఉదయం భక్తులు రామాలయంలో భజనలు, ప్రత్యేక పూజలు చేస్తున్నారు. అనంతరం సీతారాములు వారిని గ్రామ పురవీధుల్లో ఊరేగింపు చేస్తున్నారు.

సావిత్రిబాయి పూలే సేవలు ఎనలేనివి



రోలుగుంట: కొవ్వూరు పాఠశాలలో..



చోడవరంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లెక్చరర్లు



దేవరాపల్లి: గురుకులంలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రఘువర్మ, ప్రిన్సిపాల్



కాశీపురంలో ఎంఈవో-2 ఉషారాణి, ఉపాధ్యాయినులను సత్కరిస్తున్న టీచర్లు

చోడవరం రూరల్: సావిత్రిబాయి పూలే ఉపాధ్యాయినిగా దేశానికి అందించిన సేవలు ఎనలేనివని వైస్ ప్రిన్సిపాల్ ఐ.వి.వి.సత్యవతి తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ మూడు విభాగాలు, ఉమెన్ ఎంపవర్ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా సావిత్రిబాయి చిత్రపటాన్ని ఆవిష్కరించి, పూలమాలలతో ఘన నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని సావిత్రిబాయి జీవిత చరిత్రను తెలుసుకుని ఆమెను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఉమెన్‌ఎంపవర్ కమిటీ కోఆర్డినేటర్ లక్ష్మీమంగమ్మ మాట్లాడుతూ సావిత్రిబాయి ఎన్నో అవమానాలను, అడ్డంకులను ఎదుర్కొని సమాజ సేవకు తన జీవితాన్ని అంకితం చేశారని శ్లాఘించారు. ఉపన్యాసకులు జ్యోతి, సూర్యవతి, బి.పిచ్చమ్మ బాలికల జీవితాలను తీర్చిదిద్దిన సంఘటనను వివరించారు. ఎన్‌ఎస్‌ఎస్ పీవో డి.మాల్యాద్రి, వి.అప్పలనాయుడు, హెచ్.సుధీర్, ఎస్ఎం. రఫీయుద్దీన్, మల్లిబాబు, నారాయణమూర్తి, కృష్ణారావు రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి: తెనుగుపూడి డాక్టరు బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతిని స్థానిక ప్రిన్సిపాల్ పి.రఘు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ పాల్గొని సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కాశీపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం పీబీటీ సుందరీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయిలను ఘనంగా సత్కరించారు. ముందుగా ఎంఈవోలు బి.పడాల్‌దాస్, వి.ఉషారాణి పూలే చిత్రపటానికి పూల వేసి ఘనంగా నివాళులర్పించారు. పెద్దాడ వెంకటరమణ, దొగ్గ శ్రీనివాస్, బత్తి శ్రీనివాస్‌కుమార్, కొట్యాన రాంబాబు, గురుకుల విద్యార్థి పేరెంట్స్ కమిటీ సభ్యుడు ఉల్లి శ్రీను పాల్గొన్నారు.

నర్సీపట్నం: స్థానిక జెడ్పీ పాఠశాల (తురకబడి)లో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయినులను వార్డు నాయకులు నీటి కొండ గోవిందు, జనసేన టౌన్ ప్రెసిడెంట్ అద్దేపల్లి గణేష్ సత్కరించారు. గణేష్, మాకిశెట్టి రాజా రూ.10 వేలు విలువ చేసే బెంచీలు, కుర్చీలు పాఠశాలకు అందజేశారు. హెచ్ఎం కేవీ రమణ, ఉపాధ్యాయులు శ్రీనువాసరావు పాల్గొన్నారు. పెదబొడ్డేపల్లి జెడ్పీహెచ్ స్కూల్ హెచ్ఎం లక్ష్మీబాయితో ఉపాధ్యాయినులను వైఎస్సార్‌సీపీ వార్డు కౌన్సిలర్ దంపతులు బేతిరెడ్డి రత్నం, విజయ్ సన్మానించారు. నర్సీపట్నం గరల్స్ హైస్కూల్‌లో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ఉపాధ్యాయిని పద్మ, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.గౌతం పూలమాల వేసి నివాళులర్పించారు.

రోలుగుంట: కొవ్వూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద మహిళా సంరక్షణ కార్యదర్శి వరలక్ష్మి విద్యార్థులతో కలసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమం కొంతలం పాఠశాలలో తెలుగు టీచర్ సంతోషి ఆధ్వర్యంలో నిర్వహించారు.

కె.కోటపాడు: మల్లంపాలెం పాఠశాలలో హెచ్ఎం కె.శాంతి ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. పాఠశాల విద్యార్థి సావిత్రిబాయి పూలే వేషధారణ పలువురిని ఆకట్టుకుంది.

చీడికాడ: కార్యదర్శి కొల్లి నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో జైతవరం పంచాయతీ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. స్త్రీ విద్య కోసం ఎనలేని కృషి చేశారని, ప్రతి మహిళ ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఈ సందర్భంగా సర్పంచ్ కోడూరి సత్యవతి కోరారు.



నర్సీపట్నం తురకబడికి బెంచీలు, కుర్చీలు అందజేస్తున్న దాతలు గణేష్, రాజా



పెదబొడ్డేపల్లి హైస్కూల్‌లో ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న కౌన్సిలర్ బేతిరెడ్డి రత్నం దంపతులు



చీడికాడ: చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



కె.కోటపాడు: సావిత్రిబాయి పూలే వేషధారణ విద్యార్థినితో విద్యార్థులు

భూ సమస్యల పరిష్కారంపై అవగాహన



వారాడ రెవెన్యూ సదస్సులో అధికారులు

రోలుగుంట: సర్పంచ్ బంటు లక్ష్మి అధ్యక్షతన కొండపాలెం సచివాలయం వద్ద శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ ఎస్.నాగమ్మ పాల్గొని భూ సమస్యల పరిష్కారంపై రైతులకు అవగాహన కల్పించారు. భూహక్కుల వర్తింపుపై వివరించారు. వారి సమస్యలు నివృత్తి చేశారు. వినతులను స్వీకరించారు. డిప్యూటీ తహసీల్దార్ శంకరరావు, ఉప సర్పంచ్ చిరంజీవి పాల్గొన్నారు.

కె.కోటపాడు: భూ సమస్యలు పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు చక్కని వేదిక అని మండల సర్వేయర్ రామచంద్రమూర్తి అన్నారు. శుక్రవారం వారాడ, సింగన్నదొరపాలెం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. సింగన్నదొరపాలెంలో ఆరుగురు, వారాడలో 8 మంది అర్జీలను అధికారులకు అందించారు. వైస్ ఎంపీపీ లెక్కల నాగవిజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి బి.సరోజిని పాల్గొన్నారు.

పేకాడితే కఠిన చర్యలు



నారాయణరావు

మాడుగుల రూరల్: సంక్రాంతి పండగ తర్వాత గ్రామాల్లో గుల్లాట, పేకాట, కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ జి.నారాయణరావు హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ నుంచి గ్రామాల్లో జరిగే తీర్థాలు సందర్భంగా రాత్రి సమయంలో అశ్లీల నృత్యాలు, కోడి పందాలు, లాటరీ బల్లాట నిర్వహించకూడదన్నారు. నిర్వహించేవారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.

గిరిజన, దళిత ప్రజాప్రతినిధులపై వివక్ష

- రెవెన్యూ సదస్సుకు ఆహ్వానించని అధికారులు
- సర్పంచ్ గొలగాని రాణి, జెడ్పీటీసీ కాపారపు అప్పలనర్స ఆవేదన



మాట్లాడుతున్న సర్పంచ్ గొలగాని రాణి, పక్కన జెడ్పీటీసీ కాపారపు అప్పలనర్స

నాతవరం: గిరిజన మహిళ కావడంతోనే రెవెన్యూ సదస్సుకు అధికారులు తనను ఆహ్వానించలేదని నాతవరం సర్పంచ్ గొలగాని రాణి ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ ఆధ్వర్యంలో శుక్రవారం నాతవరం సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించారు. దీనికి సంబంధించి గిరిజన సర్పంచ్ రాణికి, దళిత జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్సకు కనీసం సమాచారం ఇవ్వలేదు. ఈ విషయంపై వారు స్థానిక సచివాలయంలో మాట్లాడుతూ పంచాయతీ పాలకవర్గంలో వార్డు మెంబరు సైతం లేని కూటమి పార్టీ నాయకులను గ్రామసభలో తహసీల్దార్ పక్కన కూర్చోబెట్టుకుని సదస్సు నిర్వహించారన్నారు. తాము అక్కడకు వెళ్లగా మరిచిపోయామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అక్కడ వేదికపైకి ఆహ్వానించకపోవడంతో అవమానంతో సచివాలయం లోపలకు వెళ్లి పోయామన్నారు. అసెంబ్లీ స్పీకరు అయన్నపాత్రుడు ఇలాకాలో గిరిజన, దళిత మహిళలకు అవమానం జరగడం శోచనీయమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉన్నత స్థాయి అధికారులు దృష్టి సారించాలని కోరారు. ఉప సర్పంచ్ కరక అప్పలరాజు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక సమావేశం

మాడుగుల: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. ఈ నెల 8వ తేదీన ప్రధానమంత్రి పర్యటన సందర్భంగా జన సమీకరణపై చర్చిస్తామన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిదులు హాజరు కావాలన్నారు.